మాష్టారుగారు చెప్పిన సాధనా మార్గము

30-4-1975 బుధవారం నాడు మాష్టారుగారు తీవ్ర ధ్యానం అనంతరం ఇలా చెప్పారు.

మీకు కావలసినదంటూ జీవితాన్ని సార్థకం చేసుకొనుటకు అవసరమయింది ఏదైనా ఉంటే దానిని ఇందులో ఇప్పుడే వ్రాశాను. నేను ఉన్నా, లేకున్నా, ఎక్కడున్నా, మీరు నాదగ్గరున్నా, లేకున్నా నాతో పని లేకుండా మీకు సులభ పద్ధతిలో అర్థమగునట్లు నేను చెప్పవలసింది, చెప్పేది, చెప్పబోయేది అంటూ, ఏనాటికైనా, ఏమైనా ఉంటే అది వ్రాశాను. ఇంతకన్నా చెప్పవలసింది, తెలుసుకోవలసింది లేదు. పట్టుకోవడమా - విడిచిపెట్టడమా అనేది మీలో వున్నది. అసలు ఇంతవరకూ జీవితాన్ని సార్థకం చేసికొనుటకు, ముక్తి సాధించుటకు ఇంత సులభంగా చెప్పబడలేదు. "ఏది నిజం?" "నిజానికి నిచ్చెనలు" (మతం ఎందుకు?) లోని సారాంశమంతా ఇందులో వచ్చింది. దీనిని పదేపదే భావన చేసుకుంటూ పట్టుబట్టి కూర్చొన్నారంటే చాలు. ఈసారే, ఇపుడే, ఈ జన్మలోనే ముమ్మాటికీ ముక్తిని పొందుతారు. "మీరున్నచోట అపవిత్రంగా వున్నా ఆచోటును నా తపస్సు చేత క్షాళనం చేస్తాను. ఒక్కనెల కూర్చొన్నారంటే దానంతటదే తెలుస్తుంది. శరీరానికి అవసరమయ్యే అవసరాలు వాటంతటవే తీరిపోతాయి. ఇక్కడ ఇక చర్చలకు వీలులేదు. వాటికి స్థాన ముండదు. ఎవరికి తగినట్లు వారు అవకాశం చూసుకొని వచ్చి కూర్చొంటే చాలు! దానంతటదే సాగిపోతుంది".

"అన్ని రూపాలు, అన్ని భూతాల రూపంలో గోచరించేది ఒకే ఒక విశ్వ చైతన్యం" అదే మనంగా మన కనుభవమౌతూ అదే అంతటా అన్ని రూపాలలో ఊహాలోకంలోని వస్తు సముదాయంలోని పదార్థాల్లాగా రూపమున్నట్లు గోచరిస్తుంది. తానే అవన్నీ అన్న విషయాన్ని విస్మరించడంచేత ఆ చైతన్యమే ఆ పదార్థములతో చేయబడ్డ ఒక పరిమిత దేహమని, మనస్సని తనను తాను భావించుకొని, అన్యంగా జగత్తులోని వస్తు, పదార్థ, ప్రాణి, వ్యక్తులను చూస్తుంది. పిల్లవాని మనస్సులోని భయమే భూతం రూపాన్ని ధరించి వాడికి వాస్తవమన్పించినట్లు తాను పరిమితమన్న భ్రాంతి వస్తు పదార్థాది రూపాలతో వాస్తవంగా గోచరిస్తుంది. ఆ పరిమితి నుండి విడివడడమే ముక్తి. దానికి ఇది యుక్తి. కళ్ళు మూసుకొని ఇంద్రియ నిర్మాణం చేతనే జగత్తు ఇప్పుడు ఇట్లా గోచరిస్తూందని లోతుగా జ్ఞప్తి చేసుకోవాలి. ఆ వస్తు పదార్థాది రూపాలలో తనదేహమూ ఒకటిగా వున్నట్లు, మెలకువ అనే మానసిక స్థితిలో వాస్తవమనిపిస్తుందని కనుక నిద్రావస్థలో వుండదనీ లోతుగా జ్ఞాపకం చేసుకోవాలి. తాను కేవలం నిరాకార చైతన్యమని తెలియని తనమే మనో దేహాదులు,

తర్వాత అంతటా వ్యాపించియున్న పరమేశ్వరుడను విశ్వ చైతన్యమే దాని యొక్క భావనయే (సంస్కారమే) ఇది, అని మన మనో దేహాదుల యొక్క యదార్థ తత్వాన్ని దర్శించాలి. ఈ భావన ఎంతగా చేయాలంటే "ఇది దేహము, ఇది నేను" అన్న భావం అంతరించునంతటి తీవ్రతతో చేస్తే అంతటా విశ్వ చైతన్యమే అనుభవమువుతుంది. పూర్వ వాసనల వల్ల మళ్ళీ మళ్ళీ చుట్టూ జగత్తూ, దేహము మనస్సుకు గోచరించి, దేహం తానన్న భావం తేలెత్తుతుంది. తిరిగి పైన చెప్పిన విధంగా ఆ భావాలను మళ్ళీ మళ్ళీ నిలబెట్టడమే తపోనిష్ట. అంటే ఈ విధంగా తానే ఆ విశ్వ చైతన్యంగా నిరంతరం గుర్తించుకోవటమే అజపా జపం. ఇదే గాయత్రీ మంత్రార్థము. ఇదే ఆత్మ రతి, జ్ఞాన నేత్రముతో కాముణ్ణి నశింప చేయడమంటే ఇదే. "నేను దేహం" అన్న భావం విల్లును వీడిన బాణం లాగా మనస్సును వీడి అంతా విశ్వ చైతన్యమన్న భావాన్ని లక్ష్యంగా చేసుకొని అందులో లయించడమే ధనుర్వేద సారం. "ఈ జగత్తంతా నిజంగా వాసనా రూపం. వాసనా రాహిత్యం ద్వారా నిష్ప్రపంచుడు కావడమే లక్ష్యం" అని యోగ వాశిష్టము కూడా చెప్తుంది.

"ఇది జగత్తు, ఇది దేహము" అను వాసనలు ఏ చైతన్యము నందు ఉదయిస్తున్నాయో దాని యందే ఆ భావాలను తరంగాలుగా భావించి లయింప జేయాలి. గుడ్డలోని మడతను సరిదిద్దినట్లు తద్వారా మళ్ళీమళ్ళీ విశ్వ చైతన్యుడైన పరమేశ్వరుని యందు లయింప చేయాలి. అంతటా విశ్వ చైతన్య మొక్కటే గోచరిస్తున్నప్పుడల్లా తానే చైతన్యరూపుడైన పరమాత్మ అవుతాడు. సహనము, ఓర్పు పట్టుదలలతో తిరిగి తిరిగి ఇట్లా ధ్యానిస్తుంటే అది స్థిరపడుతుంది. అదే తన రూపమని తెలుస్తుంది. భ్రాంతి ఇకరాదు. అదే ముక్తి అంటే. ఆ చైతన్యుడికి ఏపేరు పెట్టక అదే పరమేశ్వరుడన్న భావం కలిగి ఉండడం శ్రేయస్కరం.

అది ఆ విశ్వ చైతన్యుడైన పరమేశ్వరుడే అన్న భావంతో, ఇది నా దేహము, నా మనస్సునే భావాలను నశింప చేయడమే “అంగన్యాస కరవ్యానము”లని మంత్రశాస్త్రం చెబుతుంది. శరీరంలోని వివిధతత్వముల యెడలగల మన అజ్ఞానభావాలను ఈ విధంగా తొలగించి వాటినన్నింటిని ఈ విశ్వ చైతన్యంగా దర్శించడమే సాంఖ్యయోగము, నిరంతరం మనస్సును ఈ సాధన యందే తెంపులేకుండా నిమగ్న మొనర్చడమే సాధన.

అపరిమితమైన విశ్వ చైతన్యం తాను పరిమితుడనన్న భ్రాంతిలో చిక్కడం వల్ల మానవునకు అశాంతి, దుఃఖం కలుగుతున్నాయి. తిరిగి ఆ పరిమితి తొలిగిపోవడం తోటే శాంతి. ఆనందాలు తనకు సహజమౌతాయి. సరైన ఈ మార్గాన్ని విడిచి ఇతర మార్గాల ద్వారా శాంతి ఆనందాలన్వేషించడమే సంసారం, ఇది కేవలం దుఃఖప్రదం. ఇదే నిజమైన ధ్యానం, ధ్యాన శ్లోకార్థం. దీనిని ధ్యానిస్తూ పూజ చేయాలి. పూజ జరిగేటంత సేపు నిజంగా, సద్గురువు మన ముందు ఆకారంలోనూ, సర్వత్రా, మనలోనూ కేవల చైతన్యంగా వుంటారన్న గుర్తును నిలుపుకుని ప్రేమతో, భక్తి గౌరవాలతో '16' సేవలనూ చేయాలి. పూజానంతరం ఆ గురుమూర్తి మన హృదయంలోకి వెళ్ళినట్లు భావించాలి. వీలయినంత సేపు పూజ యొక్క ప్రభావాన్ని మనస్సులో నిలవనివ్వాలి.

ఓం సాయి ఓం సాయి ఓం సాయి.